
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



అమరావతిలో జస్టిస్ రామకృష్ణప్రసాద్

అమరావతి : శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరస్వామిని గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్ దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 852.40 అడుగుల వద్ద ఉంది.



ఇస్కాన్‌లో శ్రీకృష్ణజన్మాష్టమి

తెనాలి : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పట్టణ నాజరుపేటలోని ఇస్కాన్ దేవస్థానంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం వైష్ణవ భజనలు, మధ్యాహ్నం మహా అభిషేకం చేశారు.

సాగర్ ఆయకట్టులో వరి వద్దు



సాగునీటి, వ్యవసాయ సలహా మండళ్ల సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు వేదికపై ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీలు ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి

- ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోండి
- వందేళ్లలో ఎన్నడూ లేనంతగా ఆగస్టులో అతితక్కువ వర్షపాతం
- ప్రాజెక్టులలో సరైన ఇన్‌ఫ్లోలు లేవు
- త్వరలో వారాబందీ షెడ్యూల్
- కృష్ణాడెల్టాకు ఇబ్బంది ఉండకపోవచ్చు
- నీటిపారుదల సలహామండలి సమావేశంలో నిర్ణయం
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి అంబటి రాంబాబు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నాగార్జున సాగర్ ఆయకట్టులో ఈ సీజన్‌లో వరి పంట వేయవద్దని, ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు. ఈ మేరకు గురువారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జరిగిన నీటిపారుదల సలహామండలి, వ్యవసాయ సలహామండలి సంయుక్త సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం మీడియాతో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈ ఏడాది గత సంవత్సరాల కన్నా భిన్నంగా వర్షాలు ఉన్నాయన్నారు. అందువల్ల ప్రాజెక్టులలో ఇన్‌ఫ్లోలు ఆశాజనకంగా లేవన్నారు. భవిష్యత్‌లో వర్షాలు కురిసి పరిస్థితి ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నామని చెప్పారు.

సాగర్‌లో నీటి నిల్వ 154.99 టీఎంసీలు

వర్షాలు తక్కువగా పడటం వల్ల శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతలలో నీటి మట్టాలు గణనీయంగా తగ్గాయని మంత్రి రాంబాబు పేర్కొన్నారు. శ్రీశైలంలో ప్రస్తుతం 82.96 టీఎంసీలు ఉండగా, నాగార్జున సాగర్‌లో 154.99 టీఎంసీలు, పులిచింతలలో 21.36 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని వివరించారు. గత ఏడాది అన్ని ప్రాజెక్టులలో నీరు ఓవర్‌ఫ్లో కాగా, అంతకు ముందు సంవత్సరాలూ దీని కన్నా బెటర్‌గా ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఆగస్టు నెలలో వర్షపాతం చాలా తక్కువగా ఉందని చెప్పారు. సాధారణ వర్షపాతం 164.07 సెంటీమీటర్లు ఉండాల్సి ఉండగా గత నెలలో 102.07 సెంటీమీటర్లు మాత్రమే కురిసినట్లు వివరించారు. ఇది సాధారణ వర్షపాతం కంటే 38 శాతం తక్కువని వెల్లడించారు. 122 ఏళ్ల వెనక్కి వెళ్తే ఆగస్టు నెలలో ఇంత తక్కువ వర్షపాతం గత వందేళ్లలో ఎప్పుడూ లేదన్నారు. దీనివల్ల నీటి ఎద్దడి పెరగడంతో ఈ నెలలో నాట్లు, వెద పనులు సకాలంలో జరగలేదని మంత్రి పేర్కొన్నారు.

కృష్ణాడెల్టాలో ఆశాజనకం

కృష్ణా డెల్టాకు సంబంధించి ఇప్పటికీ పులిచింతలలో వాటర్ ఫ్లో ఆశాజనకంగా ఉందని మంత్రి రాంబాబు పేర్కొన్నారు. రోజూ ఏడు వేల క్యూసెక్కులకుపైగా వస్తున్నాయన్నారు. మరోవైపు గోదావరి జలాలను పట్టిసీమ నుంచి 17 పంపుల ద్వారా కృష్ణా బ్యారేజీ వరకూ తీసుకువస్తున్నామని వెల్లడించారు. దీంతో డెల్టాలో వెదజల్లడం, నాట్లు సాగుతున్నాయని వివరించారు. డెల్టాకు కావాల్సిన నీరు కన్నా 3.6 టీఎంసీలు మాత్రమే తక్కువ అవుతాయని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ నీరు పులిచింతలకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్టు వెల్లడించారు.

దేశవ్యాప్తంగా వర్షాభావం

నాగార్జున సాగర్ ఆయకట్టు పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉందని మంత్రి రాంబాబు పేర్కొన్నారు. ఏటా సాగర్ ఆయకట్టుకు ఆగస్టు 10 కల్లా నీటిని విడుదల చేసేవారమని, ఈ ఏడాది ఆ పరిస్థితి లేకపోవడం వల్ల సాగర్ కెనాల్‌కు నీటిని ఇవ్వలేదన్నారు. ఇంకా సాగర్‌కు ఇన్‌ఫ్లోస్ రావడం లేదని చెప్పారు. సాగర్ ఆయకట్టులోని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, వరి వేయవద్దని మంత్రి రాంబాబు పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో వర్షాలు పడి శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోస్ వస్తే అప్పుడు మళ్లీ పరిస్థితిని సమీక్షిస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని వెల్లడించారు. వాతావరణ శాస్త్రవేత్తలు రాబోయే కాలంలో వర్షాలు పడే అవకాశం ఉందని చెబుతున్నందున, అప్పుడు అందరికీ నీరు ఇచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రతి చుక్కనూ వినియోగించుకోవాలి

రైతులు, జలవనరుల శాఖ అధికారులు నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని, ప్రతి చుక్కనూ వినియోగించుకోవాలని మంత్రి రాంబాబు కోరారు. ప్రస్తుతం సాగర్ ఆయకట్టులో ఆరుతడి పంటలు వేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. త్వరలో వారాబందీని అమలు చేస్తామని, షెడ్యూల్ విడుదల చేస్తామని వివరించారు. ఈనెల మొదటివారంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో దీనిపై సమీక్ష జరిగిందన్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున వారాబందీ ప్రకారం నీరు ఇవ్వాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. వర్షాలు పుష్కలంగా పడితే వారాబందీని రద్దు చేస్తామని పేర్కొన్నారు. కరువు వచ్చే అవకాశం ఉందా అని మీడియా అడిగిన ప్రశ్నకు కరువు రావాలని ఎవరూ కోరుకోరని, ఒక వేళ వస్తే కరువు మండలాలు ప్రకటిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, చంద్రగిరి ఏసురత్నం, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పాల్గొన్నారు.

ప్రతి నీటిబొట్టునూ కాపాడదాం

వర్షాభావం దృష్ట్యా ప్రతి నీటిబొట్టునూ కాపాడుకుందాం. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి. ముఖ్యంగా రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి. దీనికోసం అందరం సమష్టిగా ముందుకు సాగుదాం.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కలెక్టర్, గుంటూరు

రైతులకు నీరందించండి

మా నియోజకవర్గంలో 18వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఇందులో 12 వేల ఎకరాలు వరి పంటే ఉంటుంది. ఇప్పటికే నాట్లు వేసిన రైతులకు తప్పనిసరిగా నీరు అందించాలి. కాలువల్లో ముందస్తుగా పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు చేపట్టాలి. బండ్స్ బాగుజేత, కాలువల మరమ్మతులు చేయాలి.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే, మంగళగిరి

అవగాహన కల్పించాలి

రైతులకు తక్కువ నీటితో పంటలు పండించే నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. 10 ఎకరాలలోపు ఉన్న రైతులకు నీటిని నిల్వ చేసుకునే విధానంపై సూచనలు చేయాలి. నీటి వినియోగంపైనా సలహాలు ఇవ్వాలి.

చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

న్యూస్‌రీల్

శింగరకొండ హుండీ ఆదాయం రూ. 36.53 లక్షలు



అద్దంకి రూరల్: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమానికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి సుభద్ర, శైలేంద్రకుమార్ పరిశీలించారు. రూ. 36.53 లక్షల కానుకలు, యూఎస్ డాలర్లు 94, కెనడా డాలర్లు 10 వచ్చినట్లు తెలిపారు.

నేడు జెడ్పీలో సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా పలు అభివృద్ధి పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన ఆమోదం తెలపనున్నారు. అలాగే జెడ్పీలోని ఏడుస్థాయి సంఘ సమావేశాలు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జరగనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరు కానున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు జాతీయ ప్రతిభ అన్వేషణ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకునేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15 చివరి తేదీగా తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో డిసెంబర్ 3న పరీక్ష నిర్వహిస్తారని వివరించారు. వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ బిఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా డిఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కోటప్పకొండ ఆలయ పాలకమండలి ఏర్పాటు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణ కొండలరావు, సభ్యులుగా మట్లా లింగారెడ్డి, అట్లూరి సుబ్రహ్మణ్యం, వంపుగుడి జానకయ్య, గుంటూరు లక్ష్మీ, మాడిశెట్టి స్వర్ణ, దివ్వెల రామకృష్ణ, చిలకమూరి యోగేశ్వరావు, దొడ్డా అనురాధ, మీనా సుమంత్, ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొండకావూరి అప్పయ్య గురుకుల్ నియమితులయ్యారు.

పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

నకరికల్లు: సచివాలయ వ్యవస్థ, ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ చెప్పారు. ఆమె నకరికల్లు సచివాలయాన్ని గురువారం సందర్శించారు. సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. స్థానిక గ్రంథాలయం, రైతుభరోసాకేంద్రం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఎస్సీ, ఎస్టీకాలనీలను సందర్శించారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. రైతుభరోసా వ్యవస్థ, పనితీరు దేశానికే మోడల్ అని కొనియాడారు. పథకాలన్నీ ఆదర్శంగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.కె.ఎస్.గిరిధర్, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, పంచాయతీ కార్యదర్శి భావన్నారాయణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు



అమరావతి : అమరావతి అమరేశ్వర స్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడైన వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ ఆధ్వర్యంలో అర్చకస్వామి కేశవాచార్యులు స్వామివారికి వేకువన పంచ సూక్తాలతో పంచామృత స్నపన నిర్వహించి, పలురకాల పుష్పాలతో స్వామికి అలంకారం చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సహస్ర నామపూజ నిర్వహించి భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎంబీఏ సీట్లు ఇప్పిస్తా


- ఇద్దరు విద్యార్థినులకు మంత్రి మేరుగ నాగార్జున భరోసా
- ఎస్ఎఫ్ఐ నేతల వినతి మేరకు ప్రకటన



మంత్రి నాగార్జునతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు మనోజ్

భట్టిప్రోలు: ఇద్దరు విద్యార్థినులకు వారికి కావాల్సిన చోట సీటు ఇప్పిస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున భరోసా ఇచ్చారు. అర్హులందరికీ విద్యా దీవెన, వసతి దీవెన అందేలా చూడాలని ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు పి.మనోజ్ కుమార్ గురువారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. భట్టిప్రోలులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మనోజ్ కుమార్ మంత్రిని కలిశారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని మంత్రికి వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నేతల వినతి మేరకు గ్రామంలోని చీకటి శ్రీలేఖ, కసుకుర్తి శ్రీవిద్యకు వారు కోరుకున్నచోట ఎంబీఏ సీటు ఇప్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.5,300, గరిష్ట ధర రూ.8,400, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

ఎస్సీ, ఎస్టీలపై తగ్గిన నేరాలు

- గత నాలుగేళ్లలో రాష్ట్రంలో పెనుమార్పు
- సీఐడీ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో వక్తల ఉద్ఘాటన
- ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం -1989 పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న జడ్జి పార్థసారథి, సీఐడీ అధికారులు సంజయ్, శ్రీకాంత్, సరిత తదితరులు



మాట్లాడుతున్న జడ్జి పార్థసారథి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గత నాలుగేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై నేరాలు గణనీయంగా తగ్గాయని సీఐడీ ఏడీజీ ఎన్.సంజయ్ చెప్పారు. సీఐడీ (క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) గుంటూరు ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని ఓ హోటల్‌లో 'ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల సాధికారత– వారిపై జరిగే దాడులను ఎలా నివారించాలి అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత అధ్యక్షత వహించారు. సీఐడీ ఏడీజీ సంజయ్ మాట్లాడుతూ సీఐడీ విభాగం అన్ని జిల్లాల పోలీస్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి కార్పొరేషన్ అధికారులతో నిత్యం సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. ఆయా కేసుల్లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. కేసుల్లో వాయు వేగంతో దర్యాప్తు.. బాధితులకు సకాలంలో ప్రభుత్వ నష్టపరిహారం పంపిణీ అయ్యేలా చూస్తున్నామని వెల్లడించారు. త్వరితగతిన సాక్ష్యాల సేకరణ, చార్జిషీట్ల దాఖలు, విచారణ జరిగేలా సీఐడీ పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. త్వరలో మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు.

- ముఖ్య అతిథి జిల్లా జడ్జి పార్థసారథి మాట్లాడుతూ మార్పు అనేది మన దగ్గర నుంచే రావాలన్నారు. అధికారులు అందరూ సమర్థంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.
- గౌరవ అతిథి ఎస్సీ, ఎస్టీ స్పెషల్ జడ్జి శరత్ బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కేసుల విచారణ సమయంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు.
- ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సమర్థంగా అమలు చేయడంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. అధికారులు సమర్థంగా పని చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందని సూచించారు.
- ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం చాలా విలువైనది, బలమైనదని చెప్పారు. ఈ చట్టంపై అందరిలో అవగాహన పెరగాలన్నారు.
- ఏఎన్‌యూ లా కళాశాల విశ్రాంత ఆచార్యులు ఎల్.జయశ్రీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం గురించి క్షుణ్ణంగా వివరించారు.
- సదస్సుకు అధ్యక్షత వహించిన సీఐడీ గుంటూరు ఎస్పీ కేజీవీ సరిత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చట్టం ద్వారా మేలు జరిగితే ఉద్యోగం సంతృప్తినిస్తుందని చెప్పారు. అనంతరం అతిథులు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యుల్డ్ తెగల అత్యాచార నిరోధక చట్టం–1989 పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలుత విద్యార్థులకు క్విజ్ నిర్వహించి, విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో సీఐడీ ఐజీ శ్రీకాంత్, గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీలు శ్రీనివాసరావు (క్రైం), శ్రీనివాసరావు (ఎల్/ఓ), ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) శారదామణి, సీఐడీ స్టాండింగ్ కౌన్సిల్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) ఝాన్సీలక్ష్మి, సీఐడీ న్యాయ సలహాదారు లక్ష్మణరావు, వైద్యులు మండవ శ్రీనివాసరావు, దళిత, ప్రజా సంఘాల నాయకులు మేడిద బాబురావు, గోళ్ల అరుణ్‌కుమార్, సముద్రాల కోటేశ్వరరావు, పలు జిల్లాల ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, గ్రామ/వార్డు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి బంగారు బాటలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



ఆంధ్రరత్న మున్సిపల్ పాఠశాల కొత్త భవన సముదాయ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మోపిదేవి

రేపల్లె రూరల్: విద్యార్థుల ఉన్నతికి బంగారు బాట వేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. పట్టణంలోని వివిధ పాఠశాలల్లో మన బడి నాడు–నేడు నిధులు రూ.1.35 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.30 కోట్లతో నిర్మించిన సీసీ డ్రెయిన్లు, మురుగు కాలువలను గురువారం మోపిదేవి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు సుందరంగా రూపుదిద్దుకున్నాయని చెప్పారు. విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పర్యటించినప్పుడు తన దృష్టికి వచ్చిన రహదారి, డ్రెయిన్ల సమస్యలను పరిష్కరించామన్నారు. ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల ప్రత్యేక నిధులతో పాటు మున్సిపల్ సాధారణ నిధులు కలుపుకుని అవసరమైన ప్రాంతాలలో సీసీ రహదారులు, డ్రెయిన్లు నిర్మించి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆయా పాఠశాలల్లో శిలాఫలకాలను ఆవిష్కరించి తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఎంఈవో కేసనశెట్టి సురేష్, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపులో పారదర్శకంగా వ్యవహరించాలి

కలెక్టర్ రంజిత్ బాషా



గ్రామంలో చనిపోయిన ఓటర్ల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

జే.పంగులూరు: ఓట్ల తొలగింపుపై అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. మండల పరిధిలోని కొండమూరు గ్రామంలో మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్ల తొగింపుపై గురువారం కలెక్టర్ స్వయంగా ఇంటింటికీ వెళ్లి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండమూరు గ్రామంలో ఓట్ల తొలగింపులో విచారణ సంతృప్తికరంగా ఉందన్నారు. గ్రామాల్లో మరణించిన ఓటర్లు ఎప్పుడు చనిపోయారు.. వారికి సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయనే విషయాలు వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పింఛన్లు సకాలంలో అందుతున్నాయా లేదా అని వృద్ధులను, పంటసాగు కార్డులు ఉన్న వారికి వ్యవసాయ పంట రుణాలు వస్తున్నాయా లేదా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి ఉమాదేవి, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి సరోజిని, తహసీల్దార్ ఐ.పద్మావతి, ఆర్ఐ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ఓట్ల పునఃపరిశీలన పూర్తి

బాపట్ల: ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్ల పునఃపరిశీలన, విచారణ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్లో గురువారం జరిగింది. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి పక్కాగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. గత ఏడాది జనవరి 6 నుంచి ఇప్పటి వరకు బాపట్ల జిల్లాలో ఓటర్ల జాబితా నుంచి 57,302 మంది ఓట్లు తొలగించామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పక్కాగా మరోసారి పరిశీలన, క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియ చేపట్టామన్నారు. మృతులు, శాశ్వత వలసలు, ఇతర కారణాలతో నిబంధనల ప్రకారమే ఓట్లు తొలగించామని ఆయన రాజకీయ పార్టీల నేతలకు వివరించారు.

పక్కాగా జాబితా

తొలగించిన ఓట్లలో 68 దరఖాస్తులు మాత్రమే తప్పుగా నమోదయ్యాయని పేర్కొన్నారు. 55 అర్జీలు నిబంధనల ప్రకారం సరైన పద్ధతిలో దరఖాస్తు చేయలేదని వివరించారు. ఓటర్ల జాబితా తయారీ పారదర్శకంగా పక్కాగా జరుగుతోందని కలెక్టర్ రంజిత్ బాషా స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పొరపాట్లు, సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, కలెక్టరేట్ ఏఓ గోపాలకృష్ణ, బీజేపీ నాయకుడు కె.కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కె.వి.రామకృష్ణ, టీడీపీ నాయకులు షేక్ ఎండీ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఎఫ్‌పీవోకు అవార్డు



అవార్డు అందుకుంటున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్

అమరావతి: మండలంలోని అత్తలూరుకు చెందిన ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్(ఎఫ్‌పీవో)కు ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ సంస్థ ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా అవార్డును గురువారం ప్రదానం చేసింది. జాతీయ స్థాయిలో మొత్తం పది విభాగాల్లో 51 అవార్డుల్లో మన రాష్ట్రానికి మూడు దక్కడం విశేషం. ప్రధానంగా రైతు ఉత్పత్తిదారుల సంఘం కేటగిరిలో అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మొదటి బహుమతి సాధించింది. దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోన్న ప్రభుత్వాల కోటాలో ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ప్రభుత్వంగా నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం నిర్వహించిన 'బయోఫ్యాక్ ఇండియా నేచురల్ ఎక్స్‌పో'లో పల్నాడు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా నిర్వహిస్తున్న అత్తలూరు సేంద్రియ రైతు సమాఖ్య, అత్తలూరు పాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌లు అవార్డులు సాధించాయి. కంపెనీల ప్రతినిధులైన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, అత్తలూరు పాలెం ఎఫ్‌పీవో ఎండీ నూతలపాటి సురేంద్ర బాబు ప్రకృతి వ్యవసాయంలో పద్మశ్రీ అవార్డులు సాధించిన ప్రేమచంద్, బి.బి. త్యాగి నుంచి జైవిక్ ఇండియా అవార్డు అందుకున్నారు.

21న దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరగాల్సిన ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు వర్షం వల్ల వాయిదా పడినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు తెలిపారు. వాయిదా పడిన అభ్యర్థులకు తిరిగి ఈనెల 21న పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు అవగాహన సదస్సు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఏపీ సీఐడీ ఆధ్వర్యంలో ఈనెల 8న విజయవాడ మేరీస్టెల్లా కళాశాలలో ఎన్నారై మ్యారేజ్ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా సీఐడీ ఎస్పీ సరిత తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లే మహిళలకు ఎదురయ్యే సమస్యలపై, ప్రభుత్వం కల్పించే సదుపాయాలపై సదస్సు ఉంటుందని సరిత పేర్కొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు శిక్షణ

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సమావేశ మందిరంలో గురువారం ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు జాతీయ నాణ్యత అంచనా ప్రమాణాలపై మూడు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

వైద్యులు నిబద్ధతతో పనిచేయాలి

ఫ్యామిలీ ఫిజీషియన్ జిల్లా నోడల్ ఇన్‌చార్జి వైద్యాధికారి శివగోపాల్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఇన్‌చార్జి వైద్యాధికారి శివగోపాల్

ఫిరంగిపురం: వైద్యులు నిబద్ధతతో పనిచేయాలని ఫ్యామిలీ ఫిజీషియన్ జిల్లా నోడల్ ఇన్‌చార్జి వైద్యాధికారి శివగోపాల్ సూచించారు. మండల కేంద్రంలోని సబ్‌సెంటర్‌లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 87 మందికి వైద్యులు బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. శిబిరాన్ని ఇంచార్జి వైద్యాధికారి శివగోపాల్ తనిఖీ చేశారు. రోగుల సంఖ్య, వారికి నిర్వహిస్తున్న పరీక్షల గురించి వైద్యురాలు శాంతిని అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాలు ఒకే ప్రాంతంలో కాకుండా వేర్వేరు ప్రదేశాల్లో నిర్వహించాలని చెప్పారు. దీనివల్ల అందరికీ వైద్యసేవలు అందుతాయని తెలిపారు. శిబిరం ఎప్పుడు నిర్వహించేది కూడా ప్రభుత్వ భవనాల వద్ద వాల్ పోస్టర్ల ద్వారా తెలియజేయాలని సూచించారు. అనంతరం సెయింట్ ఆన్స్ పాఠశాలకు వెళ్లారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న బరువు, ఎత్తు, రక్తహీత పరీక్షలతో పాటు సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. భోజన సమయంలో చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న పోషక పదార్థాల్ని తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంవోలు డి.జోసఫ్, కె.సాంబశివరావు, సీహెచ్‌ఓ ఎం.వెంకటరమణ, హెచ్‌వీ పి.అన్నమేరి, హెచ్‌ఏఎం విజయ్‌కుమార్, ఎంఎల్ హెచ్‌పీ అమృత, ఏఎన్ఎం లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..
పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- చిలకలూరిపేటలో 265 కొత్త పెన్షన్లు మంజూరు
- లబ్ధిదారులకు మంత్రి రజిని పంపిణీ


చిలకలూరిపేటలో కొత్త పెన్షన్లను అందజేస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అర్హత గల ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాల్ని అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏకైక లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు.

చిలకలూరిపేట పట్టణం పరిధిలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్లను ఆమె గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణం పరిధిలో 265 మందికి కొత్త పెన్షన్లు వచ్చాయని చెప్పారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే సమయంలో వారి కళ్లలో ఆనందాన్ని, కృతజ్ఞతాభావాన్ని చూశామని తెలిపారు. కుల, మత, వర్గ, పార్టీల భేదాలు లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాల్ని అందిస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని ఆమె సూచించారు. అన్ని వర్గాల అభ్యున్నతి, రాష్ట్ర ప్రగతి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డికి అందరూ అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ సీహెచ్. గోవిందరావు పాల్గొన్నారు.

నాదెండ్లలో..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే తమ లక్ష్యమని మంత్రి విడదల రజిని చెప్పారు. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీలో గురువారం నూతనంగా మంజూరైన పింఛన్లను ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో కొత్తగా 406 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. వీటితో కలుపుకుని 9,300 మందికి పైగా లబ్ధి పొందుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పింఛను అందాలంటే ఎన్నో అగచాట్లు పడాల్సి వచ్చేదని తెలిపారు. జన్మభూమి కమిటీ సభ్యుల చేతులు తడిపి, టీడీపీ కండువా కప్పుకుంటేనే అరకొరగా సంక్షేమ పథకాలు అందేవని చెప్పారు. పంచాయతీ కార్యాలయాల ముందు క్యూలో నిలబడి పింఛను తీసుకోవాల్సి వచ్చేదని, వృద్ధులు, మహిళలు సొమ్మసిల్లి పడిపోయేవారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఒకటో తేదీనే తలుపు తట్టి పింఛను ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పిల్లి సాగర్‌బాబు, ఆదాంవలి, తులం సుధాకర్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాట్రు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

పెదగొట్టిపాడు బాధితులకు న్యాయం చేకూరింది


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాధితులు

నెహ్రూనగర్: ప్రత్తిపాడు నియోజకవర్గం పెదగొట్టిపాడు సాంఘిక బహిష్కరణ అంశంలో బాధితులను జిల్లా కలెక్టర్, ఎస్పీలు నేరుగా సంప్రదించి వాఙ్మూలం తీసుకుని ఎనిమిది వారాల్లో వారికి నష్టపరిహారం అందించాలని హైకోర్టు ఆదేశించడం హర్షించదగ్గ విషయమని బాధితుల సంఘం నాయకురాలు ముకిరి అనిత హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను స్వాగతిస్తూ లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018 జనవరి 1న పెదగొట్టిపాడు గ్రామంపై ఆధిపత్య కులాల వారు దాడికి పాల్పడి సాంఘిక బహిష్కరణకు గురిచేశారని వాపోయారు. అదే విధంగా మాదిగలకు చెందిన తాగునీటి చెరువును కూడా బలవంతంగా లాక్కున్నారన్నారు. నాలుగేళ్లుగా సాంఘిక బహిష్కరణపై కేసు నమోదు చేయకుండా తమను కొంత మంది మోసం చేశారని ఆరోపించారు. దీనిపై ఐడియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు కలుగజేసుకుని సీనియర్ న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసు నమోదు చేయించారన్నారు. పిటీషనర్లు 9 మంది, బాధితులుగా 328 మంది కోర్టుకు వెళ్లి సంతకాలు చేసి అఫిడవిట్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. స్టేషన్‌లో కేసు నమోదైన తరువాత ఎఫ్ఐఆర్ దశలో బాధిత వ్యక్తికి రూ.4,25,000లో 25 శాతం 337 మందికి ఇవ్వాల్సి ఉండగా అందులో కేవలం 9 మందికే మాత్రమే పరిహారం ఇచ్చారని మిగిలిన వారికి ఇవ్వకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి హైకోర్టును ఆశ్రయించగా కలెక్టర్, ఎస్పీ గ్రామాన్ని సందర్శించి బాధితుల వాంగ్మూలం నమోదు చేసి 8 వారాల్లో పరిహారం అందజేయాలని హైకోర్టు 6న ఆదేశించడం అభినందించదగ్గ విషయమన్నారు.

జిల్లాలో తేలికపాటి వర్షం

కొరిటెపాడు(గుంటూరు): ఉపరితల ఆవర్తనం, రుతు పవన ద్రోణి కారణంగా గుంటూరు జిల్లాలో తేలికపాటి వర్షం కొనసాగుతోంది. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా తాడేపల్లిలో 33.6 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా పెదకాకానిలో 1 మి.మీ వర్షం పడింది. సగటున 4.7 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. తుళ్ళూరు మండలంలో 11.4 మి.మీ., కొల్లిపర 9.4, ఫిరంగిపురం 5.2, పొన్నూరు 5.2, దుగ్గిరాల 4.8, మంగళగిరి 4.6, గుంటూరు తూర్పు 3.6, తెనాలి 3.2, తాడికొండలో 2.6 మి.మీ చొప్పున వర్షం పడింది.

అట్టహాసంగా కృష్ణాష్టమి వేడుకలు


ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లిలో కృష్ణాష్టమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. యాదవ సంఘం, వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వాహనాన్ని మంత్రి అంబటి రాంబాబు స్వయంగా నడిపి కార్యకర్తల్ని ఉత్సాహపరిచారు. అనంతరం యువకులు ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ముందుగా వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి వడ్డవల్లి వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9,10 తేదీల్లో జేవీవీ రాష్ట్ర మహాసభలు

చీరాల: ఈనెల 9,10 తేదీల్లోచీరాలలో నిర్వహించే జన విజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, కోశాధికారి మాల్యాద్రి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక సైన్స్ ప్రచార సంస్థ, సామాన్య ప్రజలకు, సమాజానికి సైన్స్ ఫలాలను అందేటట్లు చూడడం, రాజ్యాంగంలోని ఆర్టికల్ ఎ (హెచ్) ప్రకారం శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే జేవీవీ లక్ష్యమని వారు పేర్కొన్నారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లినందుకుగాను కేంద్ర ప్రభుత్వం 2005లో జాతీయ బహుమతి ఇచ్చి సత్కరించిందని తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ బండి భిక్షాలు బాబు, కేవీపీఎస్ రాష్ట కమిటీ సభ్యులు లింగం జయరాజు, దక్షిణామూర్తి, వెంకటేశ్వర్లు, హేమంత్‌లు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పర్చూరు(చినగంజాం): ఇటీవల జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడు మల్లాది ఈశ్వర్‌ను చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే పర్చూరులోని వాటర్ ప్లాంట్ వద్ద జాగర్లమూడి లక్ష్మీనారాయణ నివాసముంటున్నాడు. గత నెల 29వ తేదీన ఆయన తన భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. పొలం నుంచి ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు తీసిఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా కబోర్డులో ఉంచిన 8 సవర్ల బంగారపు వస్తువులు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. నిందితుడి కోసం మార్టూరు సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఎస్ఐ ఎన్.చెంచు ప్రసాద్ ప్రత్యేక బృందగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తిమ్మరాజుపాలెం బస్టాండ్ వద్ద వేచి ఉన్న నిందితుడిని అదుపులోనికి తీసుకొని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 8 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఫిరోజ్ తెలిపారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

గెలుపు సెక్రటరీస్ లెవెన్ జట్టుదే!

143 పరుగులతో సరిపెట్టుకున్న ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు


ఎ.శిరీష (50 నాటౌట్)

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏసీఏ అండర్-23 ఉమెన్ స్టేట్ ప్రాబబుల్స్ వన్డే క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం ప్రెసిడెంట్స్ లెవెన్-సెక్రటరీస్ లెవెన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెక్రటరీస్ లెవెన్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన సెక్రటరీస్ లెవెన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుని ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టుకు బ్యాటింగ్ అప్పగించగా 40 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. జట్టు బ్యాట్స్ ఉమెన్లు వై హేమ రోషిణి 60 బంతుల్లో మూడు ఫోర్లతో 32 పరుగులు సాధించగా మరో బ్యాట్స్ ఉమెన్ కె ధాత్రి 34 బంతుల్లో నాలుగు ఫోర్లతో 30 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. సెక్రటరీస్ లెవెన్ జట్టు బౌలర్ జి.సింధూజ నాలుగు ఓవర్లలో 25 పరుగులిచ్చి రెండు వికెట్లను పడగొట్టింది. అనంతరం 144 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సెక్రటరీస్ లెవెన్ జట్టు 35.5 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టు బ్యాట్స్ ఉమెన్లు ఎ.శిరీష వంద బంతుల్లో అయిదు ఫోర్లతో 50 పరుగులతో నాటౌట్‌గా నిలవగా మరో బ్యాట్స్ ఉమెన్ బి హర్షిత 60 బంతుల్లో మూడు ఫోర్లతో 32 పరుగులు చేసింది. ప్రెసిడెంట్స్ లెవెన్ బౌలర్ ఎండీ షబ్‌నమ్ నాలుగు ఓవర్లలో 22 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టింది.

విజయ కీలాద్రిపై శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని విజయకీలాద్రి పర్వతంపై గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీత్రిదండి చినజీయర్ స్వామి మంగళాశాసనాలతో శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యేక పర్యవేక్షణలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ పెరుమాళ్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం అభిషేక మహోత్సవం, విశేష అలంకరణ, గీత హవనం, శ్రీ కృష్ణ వైభవ ప్రవచనం, క్షీరతర్పణం, అష్టోత్తర శతనామార్చన, తిరునక్షత్ర తనియన్, విశేష ప్రసాద నివేదనల కార్యక్రమాలు నిర్వహించారు.

యార్డుకు 35,130 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 35,130 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,064 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,561 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

జావలిన్ త్రో, షాట్‌ఫుట్‌లో ప్రథమస్థానం


జంగం సిద్ధార్థను అభినందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

బాపట్ల అర్బన్: గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఆగస్టు 31న జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్ మీట్‌లో బాపట్ల జిల్లా కొండుభొట్లపాలెం గ్రామానికి చెందిన జంగం సిద్ధార్థ సత్తా చాటాడు. అండర్-20 విభాగంలో జావలిన్ త్రో, షాట్ పుట్ క్రీడాంశాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల 21న ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా జంగం సిద్ధార్థ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును గురువారం కలిసి ఆశీస్సులు అందుకున్నాడు. ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతోమంది కొండుభొట్లపాలెం జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిందన్నారు. సిద్ధార్థ జాతీయస్థాయిలో రాణించి మంచి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. జంగం సిద్ధార్థ తండ్రి జంగం రాజు, కొండుభొట్లపాలెం మాజీ సర్పంచ్ కాగా, తల్లి జంగం భాగ్యలక్ష్మి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీహెచ్ రామారావు, పల్లప్రోలు శంకర్, మామిడాల ఆదిశేషు, పెద్ది హరిబాబు, పర్వతిరెడ్డి శ్రీనివాస రావు, ఉమ్మారెడ్డి రామాంజనేయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన రాష్ట్ర బృందం



మార్టూరు: మండలంలోని ద్రోణాదుల ప్రాథమిక పాఠశాల, కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను రాష్ట్ర మధ్యాహ్న భోజనం, శానిటేషన్ టీం సభ్యులు ఎంఈఓ వస్రాం నాయక్‌లతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ రాగి జావ, చిక్కీల తయారీ తేదీ, తుది గడువులను తప్పక పరిశీలించి వినియోగించాలని సూచించారు. ప్రతి వారం ఏ రంగు గుడ్లు పంపిణీ చేయాలో అవి మాత్రమే సరఫరా చేయాలన్నారు. అందుకు విరుద్ధంగా జరిగితే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండీఎం టెస్ట్ రిజిస్టర్‌తో పాటు ఎంఈఓ కార్యాలయం నుంచి వచ్చిన ప్రతి వస్తువును స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ద్రోణాదుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని నాణ్యతను వారు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీం సభ్యులు వి.చైతన్య, బి.వేణుగోపాల్, స్థానిక ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరు.. మనస్తాపంతో మరొకరు..


మృతుడు బుజ్జిబాబు(ఫైల్)

తెనాలిరూరల్: అనారోగ్య కారణాలతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిని ఘటన తెనాలి రైల్వేస్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి రైల్వే క్వార్టర్స్‌లో నివసించే బుజ్జిబాబు(45) మచిలీపట్నంలో విధులు నిర్వహిస్తున్నాడు. అనారోగ్య కారణాలతో మూడు నెలలుగా సెలువులో ఉన్నాడు. మధుమేహం, లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున రైల్వే స్టేషన్ పడమర బుకింగ్ కైంటర్ సమీపంలో ఐదో నంబర్ ప్లాట్‌ఫాంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టాల వెంబడి మృతదేహం ఉందని స్థానికులు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ ఎల్.సరస్వతి, సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుంటూరులో...

గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన ఆర్.రామాంజనేయులు నాయక్ (32) ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 2వ తేదీన జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం న్యూరాలజీ విభాగంలో చేరాడు. బుధవారం సాయంత్రం ఫిట్స్ వచ్చాయి. దీంతో మానసికంగా కృంగిపోయి గురువారం తెల్లవారుజామున మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.